


"ఇలా ఇవ్వు మావయ్యా !" అంటూ నా చేతిలోని బ్రీఫ్‌కేస్ లాకున్న వాసు – ఆ కంపార్ట్‌మెంట్‌లోంచి ఆదరాబాదరాగా దిగుతూన్న నలుగురైదుగురి వంక పరిశీలనగా చూశాడు.

"ఏమిట్రా ?"

"ముందు–నీ జేబులో పర్స్ ఉందో లేదో చూసుకో !" మెల్లగా అన్నాడు.

వాడెందుకలా అంటున్నాడో పాలుపోక పోయినా–ఒకసారి పాంట్ జేబు తడివి చూసుకున్నాను. "ఉందిరా !"

"ఉందా ? ఐతే, దిగు."

పాండ్యన్ ఎక్స్‌ప్రెస్‌నించి దిగిన నేను ఆ ఎగ్మూర్ స్టేషన్‌లోనే మరో ప్లాట్‌ఫామ్ మీదున్న ఎలెక్ట్రిక్ ట్రెయిన్

ఎక్కిన తర్వాత "ఎందుకలా నా మనీ పర్స్ గురించి అడిగావ్ ?" అన్నాను.

వాసు మెల్లగా నవ్వుతూ, "నేనీ మధ్య కొత్తగా ఒక రిసెర్చ్‌కి పూను కున్నాను," అన్నాడు.

"ఓహో !" అన్నాను. అంతకన్నా ఇంకేం అనగలను? వాడి తండ్రికి వాడొక్కడే బిడ్డ. అంచేత, ఆ తండ్రి, వాణ్ని చూసుకొని తెగ మురిసిపోయే వాడు. తరచు 'మా వాడు అసాధ్యు డోయ్ !' అని కూడా అంటూండేవాడు. దానికి తగ్గట్టు - తనకు అసాధారణమైన తెలివితేట లున్నట్లు ఇతరులకు తెలియా లని చిన్నప్పట్నుంచీ చాలా తాపత్రయ పడేవాడు వాసు. అంచేత, ఆ బాపతే అనుకొని, ఆ రిసెర్చ్ పట్ల ఆట్టే కుతూ హలం చూపించలేదు నేను.

"అలా చప్పబడిపోయావేంటి మావయ్యా ? ఆ రిసెర్చ్ ఏమిటని అడగవేం ?"

"చెప్పు, మరి !"

"జేబుదొంగల గురించి."

"ఏం రిసెర్చ్ చేశావ్ ?"

"వస్తా...కూర్చో మావయ్యా," అంటూ వాడూ కూర్చొని, "ఆ జేబు దొంగలు కూడా మనలాగే ఉంటారు," అన్నాడు.

"అంటే...?" నాకు నవ్వాగింది కాదు.

"నవలల్లోనో, సినిమాల్లోనో వచ్చే జేబుదొంగలకు మల్లే చచ్చినా ఉండరు. మరి మన తెలుగు సినిమాలలో అయితే- అలాంటి జేబుదొంగలకు ఒక చెంప మీద పులిపురికాయ, మరో చెంపమీద కత్తివేటులాంటి మచ్చ పెట్టి-బనీను, లుంగీ తొడిగించేస్తారు. మెడకొక హాండ్ కర్చీఫ్‌ను చుట్టేస్తారు. చేతులకు ఏవో తాయత్తుల్లాంటివి కట్టేస్తారు...అసలంత వికృతంగా ఉండరు జేబుదొంగలు."

"ఇంకెలాగుంటారు ?"

"ఇంతకీ, నువ్వు ఒక్క జేబు దొంగనైనా చూశావా ఇంతవరకు ?"

"ఊఁహుఁ."

"వాళ్ళెలా ఉంటారంటే-మామూలు మనుషుల్లోంచి వాళ్ళను వేరుచేసి పోల్చు కోలేనంత ఇదిగా ఉంటారు. రెండు మూడు సందర్భాలలో పట్టుబడిపోయిన ఇద్దరు ముగ్గురు జేబుదొంగలను చూస్తే, వాళ్ళు నిజంగా జేబులు కొట్టేశారా అన్నంత ఆశ్చర్యం కలిగింది-వాళ్ళ మీద రిసెర్చ్‌కి పూనుకున్నా నాకే !"

ఎలెక్ట్రిక్ ట్రెయిన్ కదిలింది.

వాసు నాకు మరింత దగ్గరగా జరిగి, నా చెవిలో రహస్యంగా "అదో-ఆ పక్క వరుసలో కూర్చొనున్న బట్టతల మనిషిని చూశావా ? అతనెవరై ఉంటాడని అను కుంటావ్ ?" అన్నాడు.

"జీతాలు సరిగా అందని ఏ బడి పంతులులాగానో ఉన్నాడు."

"అతని మాసిన కోటు, దోవతి

చూసి నీకలా అనిపించి ఉంటుంది. అవునా? నిజానికి అతని కళ్ళజోడు చత్వారండి కాక సాదా అద్దాలు గలది అయి ఉండొచ్చేమో! అతని చేతిలో ఏదో పుస్తకం ఉందే గాని, దానిమీద అతని దృష్టి ఉండకపోవచ్చు. అదో- చూశావా, మావయ్యా! అతను చేతులు నలుపుకుంటున్నాడు. ఎందుకో తెలుసా? ఎవరి జేబులు కాజేద్దామా అని ఆ చేతులు తహతహ లాడిపోతున్నాయన్న మాట."

"ఐతే, అతగాడు జేబుదొంగ అయి ఉంటాడంటావా?"

"పొట్టి జేబుదొంగ కాదు; ఆరితేరిన జేబుదొంగ."

"అతని గురించి నాకలా అనిపించడంలేదు గాని, అతని పక్కన కూర్చొనున్న ఆ పొట్టి యువకుడ్ని కాస్త అనుమానించవచ్చేమో అనిపిస్తోంది."


"అందరూ అక్కడే పప్పులో కాలు వేస్తూంటారు సాధారణంగా. అందుకే నేసీ రిసెర్చ్‌కి పూనుకుంది. ఆ పొట్టి యువకుడి కళ్ళు అందరివంకా చూస్తున్నాయి గనుకేనా నీకా అనుమానం? కాని, సిసలైన జేబుదొంగ ఎవడూ అంత పబ్లిక్‌గా అందరివంకా చూడడు... మావయ్యా ఆ బట్టతల మనిషి మనకేసి క్రీగంట చూస్తున్నాడు గమనించావా? మనం అతని గురించి మాట్లాడుకుంటూండ వచ్చని అతనికి అనుమానం కలిగిందేమో!... ఉష్! అతనివంక చూడకిక."

ఇంతలో పార్క్ స్టేషన్ వచ్చేసింది. ఆ పొట్టి యువకుడు లేచాడు. వెంటనే బట్టతల మనిషి కూడా లేచాడు. ఇద్దరూ దిగారు. నేనూ, వాసూ కూడా బస్‌స్టాండ్‌కు వెళ్ళడానికి అక్కడే దిగాలి.

మేం వంతెన దాటేసరికి మా ముందు వెళ్తున్న ఆ బట్టతల మనిషి ఆగి హఠాత్తుగా వెనుతిరిగాడు. "ఎందుకు నన్ను వెంబడిస్తున్నారు?" అన్నాడు కాస్త కోపంగానే.

నేను గతుక్కుమన్నాను. వాసుగాడు కూడా నీళ్ళనములుతాడేమో అనుకున్నా. కాని, వాడు తాపీగా "మిమ్మల్ని వెంబడించేంత కర్మ మాకేం పట్టిందండీ? ఈ మా మావయ్య మధురనించి వస్తూంటే, ఈయన్ని రిసీవ్ చేసుకోడంకోసం ఇందాక ఎగ్మూర్ స్టేషన్‌కు వెళ్లా. అక్కడ్నించి మేమిద్దరం ఈ పార్క్ స్టేషన్‌కు బయలుదేరిన ఎలెక్ట్రిక్ ట్రెయిన్‌లో మీరూ ఉన్నట్లున్నారు...అంతే. ఇది కేవలం యాదృచ్ఛికం. అసలు మేమే మిమ్మల్ని అనుమానించాల్సింది పోయి, మీరు మమ్మల్ని అనుమానిస్తున్నారా? బావుందండీ!" అన్నాడు.

ఇందాక ఎలెక్ట్రిక్ ట్రెయిన్‌లో మాకు కనిపించిన ఆ పొట్టి యువకుడు




కూడా ఈ తమాషా ఏమిటో చూడ్డానికని అక్కడే ఆగినట్లుంది

బట్టతల గోక్కుంటూ, "ఏమిటేమిటీ! నన్నే అనుమానిస్తున్నారా ? నేనెవరను కుంటున్నారు?" అన్నాడతగాడు. ఇంతలో అటు వస్తూన్న ఎవరో ఒక వ్యక్తి, అతన్ని చూసి ఆగి, ఏమిటి ప్రొఫెసర్ గారూ, ఇక్కడ నిలుచోనున్నారు ?" అన్నాడు.

"ఓ...నువ్వా ! ఎంతకాలమైంది నిన్ను చూసి ?" అంటూ ఆ బట్టతల మనిషి మమ్మల్ని ఆ వ్యక్తికి చూపుతూ, "ఆ శాల్తీలిద్దరూ ఇందాకట్నించి నన్ను వెంటాడుతున్నారు," అన్నాడు.

వెంటనే ఆ వ్యక్తి మా వంక తిరిగి, "ఎవరు మీరు ? మా ప్రొఫెసర్ గారిని దోచుకోవాలని చూస్తున్నారా?" అన్నాడు.

వాసు ఏ మాత్రం తొణక్కుండా "మిస్టర్ ! మాటలు తిన్నగా రానియ్ ! నేనో పెద్ద ఫాక్టరీలో లేబర్ ఆఫీసర్ని. కావలిస్తే, నా ఐడెంటిటీ కార్డు చూసుకో," అంటూ జేబులోంచి తీసి చూపించాడు.

మేం ఇంకా అక్కడే ఉంటే ఏం గొడవ జరుగుతుందోనన్న భయంతో "వాసూ ! ఏదో చిన్న పొరబాటు జరిగి పోయింది. అంతటిదో వదిలేయ్. మనకు టైమయిపోతోంది పద !" అంటూ వాడ్ని బరబర లాక్కెళ్ళాను బస్ స్టాప్కు.

పారిస్ కార్నర్కు వెళ్ళే బస్లోకి జనాన్ని తోసుకుంటూ ఇద్దరం జొర బడ్డాం. సీట్లు ఖాళీ లేనందున మేమిద్దరం నిలబడక తప్పింది కాదు.

బస్సు కొంత దూరం వెళ్ళాక

"మావయ్యా, నీ కుడి వైపుకు చూడు," అన్నాడు వాసు నా చెవిలో.

అటు చూసి అమాంతంగా విస్తుపోయాను. మాకు కొద్ది దూరంలోనే ఆ బట్టతల మనిషి నిలుచోనున్నాడు. పక్కనే ఆ పొట్టి యువకుడు కూడా ఉన్నాడు.

"ఇక అటు చూడకు మావయ్యా! అతని సంగతి నే కనుక్కుంటాను. అతను నిజంగా ప్రొఫెసరో, పిక్‌పాకెట్‌గాడో ఈ బస్సులోనే తేలిపోవాలి," అని గొణుక్కుంటూన్న వాసు ఉలిక్కిపడి, "అరే! నువ్విందాక అనుమానించిందే కరెక్ట్‌లా ఉంది మావయ్యా! ఆ బట్టతల మనిషి పక్కనే ఇందాకట్నుంచీ అంటి పెట్టుకొని ఉన్న ఆ పొట్టి యువకుడే జేబుదొంగలా ఉంది. నేనే పప్పులో కాలువేశాను...అరే! ఆ బట్టతల ప్రొఫెసర్ కోట్ జేబులోని పర్సునే ఆ పొట్టి యువకుడు లాగేస్తూన్నాడు," అన్నాడు. నేనటు తిరిగి చూసేలోగానే "దొంగ...దొంగ...పట్టుకోండి," అంటూ వాసు రివ్వున జనాన్ని తోసుకు వెళ్ళి, ఆ పొట్టి యువకుణ్ని గట్టిగా పట్టుకున్నాడు.

బస్సులో కలకలం...డ్రయివర్ సడన్ బ్రేక్‌తో బస్సును ఆపాడు. కండక్టర్ ఒక్క అంగలో వెళ్ళి ఆ పొట్టియువకుడ్ని వాటేసుకున్నాడు.

వాసు రొప్పుతూ రోజుతూ, "కండక్టర్! ఈ ప్రొఫెసర్‌గారి జేబులోంచి మనీపర్సును ఇతగాడు లాగేస్తూండగా చూసి పట్టుకున్నాను. ఇతన్ని పోలీసులకు అప్పగించండి," అన్నాడు.


ఆ ప్రొఫెసర్ వెంటనే "నోర్మూయ్!" అని గర్జిస్తూ, "పోలీసులకు పట్టించాల్సింది మిమ్మల్నా, మా అబ్బాయినా?" అన్నాడు.

"ఏమిటండీ మీరనేది? ఇతను మీ అబ్బాయా?" అన్నాడు కండక్టర్ చివాలున ఆ పొట్టి యువకుని కాలర్ మీద నించి తన చేతిని తీసేస్తూ.

"అవునయ్యా! నేనిలా రెండు చేతులూ పైకెత్తి ఆ రాడ్ పట్టుకొని నిలుచోనున్నా నా? మా వాడ్ని కాస్త నా కోట్ జేబులో ఉన్న పర్సు తీసి, రెండు టిక్కెట్లు కొనమన్నాను. అంతే... ఇంతలో మా వాడ్ని కాస్త ఈ రౌడీ పట్టుకొని, జేబుదొంగ అని అంటాడా?"

"మాటలు తిన్నగా రానియ్యండి! నేనా రౌడీ?" అంటూ వాసు మళ్ళీ తన ఐడెంటిటీ కార్డును తీసి, ఆ ప్రొఫెసర్‌కే కాక చుట్టూ ఉన్న వారికి కూడా చూపించాడు.

"ఇదేదో చిన్న మిస్అండర్‌స్టాండింగ్‌లా ఉంది. దీనికోసం బస్సు ఆపు చేశారేమిటీ?" అని బస్సులోని ఇద్దరు ముగ్గురు గొణుక్కుంటూండగా—నే నా ప్రొఫెసర్‌కి మా వాసూగాడి తరఫున క్షమాపణలు చెప్పి ఆయన కోపం ఉపశమింపజేసేసరికి నా తలప్రాణం తోకకు వచ్చినంత పనైంది.




మళ్ళీ బస్సు బయలుదేరింది.

పారిస్ కార్నర్‌లో దిగగానే వాసు "చూశావా, మావయ్యా! నేను మొదట చెప్పినట్లే ఈ మద్రాసులో మామూలు మనుషులకూ, జేబుదొంగలకూ తేడా తెలీడంలేదు కదూ? అందుకే హమేషా మన జాగ్రత్తల్లో మనం ఉండడం మంచిది. అవునూ-ఇందాకే అడగాలనుకున్నాను. నువ్వు పర్సును పాంట్ సైడ్ పాకెట్‌లో దాచుకుంటావేమిటి? కొందరు జేబుదొంగలు చల్లగా ఏబ్లేడ్‌తోనో పాంట్ పక్కజేబులు ఏ మాత్రం తెలీకుండా కోసి, పర్సులు లాగేస్తూంటారట. హిప్ పాకెట్‌లో అయితే, వాళ్ళలా కోసేటప్పుడు ఇట్టే మనకి తెలిసిపోతుంది. అందుకే నేనెప్పుడూ నా పర్సును ఇలా హిప్ పాకెట్‌లో ఉంచుకుంటూ......"

వాసు గుడ్లు తేలవేశాడు.

"ఏమైంది?" అన్నాను ఖంగారుగా.

"నా పర్సు పోయింది."

నేను నవ్వుకుంటూ, నా పాంట్ జేబులోంచి వాడి పర్సును తీసివ్వగానే మరింత నిర్ఘాంతపోయాడు. "మావయ్యా! నువ్వా?"

"అవును నువ్వెంత హుషారుగా ఉన్నావో చూద్దామని-ఇందాక నువ్వు బస్సు ఎక్కేటప్పుడు చల్లగా నీ హిప్ పాకెట్‌లోంచి లాగేశాను."

"మావయ్యా!" అంటూ వాసు నా కళ్ళల్లోకే కొన్ని క్షణాలపాటు గుడ్లప్పగించి చూస్తూండిపోయాడు.

"ఏమిట్రా?"

"జేబుదొంగలపై ఈ రిసెర్చ్‌కి ఇంతటితో స్వస్తి చెప్పేస్తున్నాను," అంటూ లెంపలు వేసుకున్నాడు.